సాక్షి తిరుపతి

సోమవారం। 16। జూన్। 2025



తీరంలో సందడి

వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద సముద్ర తీరంలో ఆదివారం పెద్దసంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు. - 8లో



ముగిసిన బాధల బదిలీలు

ఉమ్మడి జిల్లాలో పలు ఇక్కట్ల నడుమ చేపట్టిన బదిలీ ప్రక్రియ ఆదివారం ముగియడంతో టీచర్లు ఊపిరిపీల్చుకున్నారు. - 8లో



ఆనాటి.. ఆ స్నేహమానందగీతం!

శ్రీకాళహస్తి ఆర్‌పీబీఎస్ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు దాదాపు 31 ఏళ్ల అనంతరం కలుసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



ఊరేగుతున్న దేవదేవేరులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణ వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు పర్యవేక్షించారు.


శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ సేవా సంఘం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 91,720 మంది స్వామివారిని దర్శించుకోగా 44,678 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భాషా పండితులకు అన్యాయం

తిరుపతి ఎడ్యుకేషన్ : వెబ్ కౌన్సెలింగ్ ద్వారా మిగిలిపోయిన భాషా పండితులకు చేపట్టిన బదిలీ ప్రక్రియలో పండిట్లకు తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం (ఎస్‌ఎల్‌టీఏ) ఉమ్మడి చిత్తూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, సిబ్బాల కిరణ్‌కుమార్ వాపోయారు. బదిలీ ప్రక్రియలో సీనియారిటీ జాబితాకు అనుగుణంగా ప్రాధాన్యత దృష్ట్యా వెబ్ ఆప్షన్ పెట్టుకున్న సీనియర్లకు దూరంగా, సీనియారిటీ జాబితాలో అట్టడుగున వున్న వారికి సమీప పాఠశాలలు కేటాయించడం దుర్మార్గమని తెలిపారు. దీంతో సీనియర్లు మానసిక ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించిన బదిలీ ప్రక్రియను రద్దు చేసి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్లకు న్యాయం చేయాలని కోరారు. ప్రతి రెండేళ్లకు బదిలీల్లో స్థానభ్రంశానికి గురవుతున్న వీరికి శాశ్వతంగా న్యాయం చేసేందుకు పదోన్నతులు కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

"సూపర్ సిక్స్ పథకాలతో జీవితాలను మారుస్తాం.. అందులో భాగంగా విద్యార్థుల ఉన్నత భవితకు చేయూతనందిస్తాం.. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లివందనం కింద ఏటా రూ.15వేలు అందిస్తాం.. రూ.25వేల కంటే తక్కువ వేతనం పొందే చిరుద్యోగుల బిడ్డలకు సైతం పథకం వర్తింపజేస్తాం.. ఆంక్షలు లేకుండా అర్హులందరికీ నగదు జమ చేస్తాం'' అంటూ సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు ఆర్భాటంగా ప్రకటించారు. చిలక పలుకులు వల్లించి అందరినీ నమ్మించారు. ఏరు దాటాక తెప్ప తగలేసినట్టు.. అధికారంలోకి రాగానే తొలి ఏడాదే సంపద సృష్టి పేరుతో ప్రజలకు పంగనామాలు పెట్టారు. ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తడంతో చేసేది లేక ఈ నెల 12వ తేదీన తల్లివందనానికి శ్రీకారం చుట్టారు. అయితే ఇక్కడే బాబు తన నిజస్వరూపం బయటపెట్టారు. కఠిన షరతులు విధించి వేలాది మంది అమ్మలపై అనర్హత వేటు వేశారు. చాలీ చాలని వేతనాలతో బతుకులు సాగించే కాంట్రాక్ట్.. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఎగనామం పెట్టారు.



అరకొర వందనం

జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి శఠగోపం

- తల్లికి వందనం.. 45శాతం మందికి ఎగనామం
- కఠిన నిబంధనలతో అనర్హులుగా ప్రకటించిన ప్రభుత్వం
- లబోదిబోమంటూ సచివాలయాలకు బాధితుల పరుగులు
- జాబితాలో పేర్లు లేక తల్లడిల్లుతున్న ఒకటి, ఇంటర్ ఫస్టియర్ పిల్లలు.. తల్లులు
- అర్హులందరికీ లబ్ధి చేకూర్చకుంటే పోరాటం తప్పదంటున్న విద్యార్థి సంఘాలు

అధికారిక, అనధికారిక షరతులు ఇవీ..

- 300 యూనిట్ల విద్యుత్ బిల్లు ఉందంటూ అనర్హత వేటు
- పాఠశాలలకు సక్రమంగా రావడం లేదని, డ్రాప్ అవుట్స్ పేరుతో అనర్హులు
- పొలం ఎంత ఉందనే విషయం చూడకుండా.. పొలం ఉంటే చాలు కట్
- కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉంటే అనర్హులే
- ఇంటర్ కాకుండా పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులలో చేరినవారికి మొండి చెయ్యి
- విద్యార్థి తల్లి ఇంటి పేరు మారినా, చిన్నపాటి తప్పులు ఉన్నా కట్
- తల్లి మరణించిన విద్యార్థులు సచివాలయంలో కలవాలని మెలిక
- ఒకటి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు తర్వాత వేస్తామంటూ దాటవేత
- మూడు, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నా అనర్హత వేటు
- పట్టణాలలో వెయ్యి చ.అడుగుల స్థలం ఉన్నా, సొంత ఇల్లు ఉన్నా కట్
- 3 ఎకరాల పొలం ఉన్నా అనర్హులే
- ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన వారికి తల్లికి వందనం కట్

తిరుపతి సిటీ : ఎన్నికల సమయంలో ఓట్ల కోసం సూపర్‌సిక్స్ అంటూ మభ్యపెట్టి అధికారంలోకి కూటమి ప్రభుత్వం యథేచ్ఛగా ప్రజలను వంచిస్తోంది. ఎటువంటి ఆంక్షలు లేకుండా కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికీ ఏడాదికి రూ.15వేలు తల్లికి వందనం పథకం కింద అందిస్తామని ఊదరగొట్టింది. తొలి ఏడాది తల్లికి శఠగోపం పెట్టేసింది. ఇప్పుడు పాఠశాలల నిర్వహణ, మరమ్మతుల పేరిట రూ.2వేలు కోత వేసింది. చచ్చినోడి పెళ్లికి వచ్చిందే కట్నం అని ప్రజలు సర్దిచెప్పుకున్నప్పటికీ పథకాన్ని అరకొరగానే అమలు చేస్తోంది. అందులో భాగంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, వైద్య శాఖ, ఇతర ప్రభుత్వ శాఖలు, వాటి అనుబంధ సంస్థలలో పనిచేసే సుమారు 50వేల మంది చిరుద్యోగులను అనర్హుల జాబితాలోకి నెట్టేసింది. ఈ మేరకు జిల్లాలో 45శాతం మంది తల్లులను అనర్హులుగా ప్రకటిస్తూ రెండు రోజుల క్రితం సచివాలయాలకు అర్హుల జాబితాను పంపించింది.

అవాక్కవుతున్న తల్లులు

కూటమి ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందన అర్హులు జాబితాను సచివాలయాలలో ప్రదర్శించారు. అందులో తమ పేరు లేదని అర్హులైన విద్యార్థుల తల్లులు అవాక్కవుతున్నారు. జిల్లాలోని 33 మండలాలలో మండలానికి కనీసం 1,200మందికి తల్లికి వందనం అందకుండా ఆంక్షలు పెట్టి దూరం చేశారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా దాదాపు 1.03మంది విద్యార్థుల తల్లులపై అనర్హత వేటు పడింది. దీంతో గతంలో అమ్మ ఒడి కింద నగదు పొందిన అర్హులైన తల్లులు ఏంచేయాలో పాలుపోక లబోదిబో మంటూ సచివాలయ సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నా తల్లికి వందనం అందకపోవడం దారుణమని, తప్పుడు సమాచారంతో అనర్హుల జాబితాలో పెట్టారని ఆవేదన చెందుతున్నారు.

పంగనామం పెట్టేశారు



తల్లికి వందనం అంటూ మహిళల మభ్యపెట్టి ఓట్లు దండుకుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తల్లికి పంగనామం పెట్టేశారు. అర్హులను సైతం ఏదో ఒక సాకు చూపి అనర్హుల జాబితాలో చేర్చి పేదల తల్లులను మోసం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం ప్రతిష్టాత్మకంగా అమలైంది. మాట ఇచ్చిన ప్రకారం అర్హులైన ప్రతి విద్యార్థి తల్లికీ అందించారు. కూటమి ప్రభుత్వం ప్రాజ వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు.

–చెంగల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేత, చంద్రగిరి

అందరికీ రూ.15వేలు ఇవ్వాలి



కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం కింద రూ.15వేలు అందించాలి. రూ.13వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సహించేదిలేదు. చిరుద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆశ వర్కర్ల పిల్లలకు తల్లికి వందనం అందించాలి. లేకుంటే విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసనలకు పిలుపునిస్తాం.

– ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, తిరుపతి

అర్హులందరికీ అందించాలి



తల్లికి వందనం రూ.15వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట మార్చింది. రూ.2వేలు కోత పెట్టి రూ.13వేలే ఇస్తోంది. పేదలకు మాయ మాటలు చెప్పి అర్హులకు సంక్షేమ పథకాలను అందించకుండా తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగానే రాద్ధాంతం చేస్తోంది. అర్హులైన ప్రతి విద్యార్థికీ పథకం అందించి తీరాలి.

– ఆర్.ఆషా, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఆంక్షలు లేకుండా అందించాల్సిందే



కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎటువంటి షరతులు లేకుండా అర్హులైన ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం అందించాలి. ఏడాదిగా ఈ పథకం కోసం పేదల విద్యార్థులు ఎంతో ఆత్రుతతో ఎదురు చూశారు. కానీ లేనిపోని షరతులు పెట్టి 50శాతం మందిని అనర్హులుగా ప్రకటించడం దారుణం. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం అందించి తీరాల్సిందే. పథకాన్ని నీరుగార్చేందుకు యత్నిస్తే ఉద్యమిస్తాం.

– భగత్ రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ, తిరుపతి

మెలికలు పెడితే పోరుబాటే



కూటమి సర్కార్ హామీల మీద హామీలు గుప్పించి అధికారం చేపట్టి పథకాలకు మెలికలు పెట్టి అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు చదివే ప్రతి పేద విద్యార్థికీ పథకం అందించాలి. జిల్లాలో బడుగు బలహీన వర్గాలకు చెందిన చాలా మందికి తల్లికి వందనం రాలేదు. సచివాలయాలలో అర్హుల లిస్టును పరిశీలిస్తే అర్థం లేని కారణాలు చూపి అనర్హుల జాబితాలో చేర్చేశారు. ఈ పథకంలో మెలికలు పెడితే పోరుబాట తప్పదు.

– శివశంకర్ నాయక్, జేఎస్ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, తిరుపతి

పూర్తి స్థాయిలో అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిందే. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే ఆ పార్టీలకు మనుగడ కష్టం. తల్లికి వందనం పథకం కింద రూ.15వేలను జిల్లాలో అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో జమ చేయాలి. షరతులు వర్తిస్తాయి అంటూ మహిళలను వంచించడం మానుకోవాలి. లేకుంటే తిరుగుబాటు తప్పదు

– లోకేష్, పీడీఎస్‌యూ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

ముక్కంటీశుని ఆలయం కిటకిట



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వరుస సెలవులు, ఆదివారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28 వేల మంది భక్తులు ముక్కంటీశుని దర్శించుకుని ఉంటారని ఆలయాధికారులు అంచనా వేశారు. రూ.500 అంతరాలయ దర్శనం టికెట్లు 703, రూ.200 ప్రత్యేక దర్శనం టికెట్లు 3,180, రూ.50 శీఘ్రదర్శనం టికెట్లు 5,008 విక్రయించినట్లు పేర్కొన్నారు. రూ.500, రూ.750, రూ.1,500, రూ.2,500, రూ.5వేలు టికెట్లు కొని 5,701 మంది భక్తులు రాహు-కేతు పూజలను చేయించుకున్నట్లు వెల్లడించారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,230 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఆదివారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే చిన్న చిన్న సమస్యలను మండల, డివిజన్ స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు.

ఆలయాల రక్షణకు అలుపెరుగని పోరాటం



దామినేడు మహిళలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి సమన్వయకర్త మోహిత్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త మోహిత్‌రెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : టీడీపీ నేతలు హిందూత్వంపై దాడి చేయడం దారుణమని, ఆలయాల రక్షణకు అలుపెరుగని పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. దామినేడులో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన నాగాలమ్మ ఆలయాన్ని పరిశీలించారు. ఆదివారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నాగాలమ్మ పుట్టను తొలగించడం, శూలాలను మాయం చేయడం, ఆలయ ఆనవాళ్లు లేకుండా చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో హిందూ ఆలయాలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న నాగాలమ్మకు అపచారం చేశారని మండిపడ్డారు. టీడీపీ నేతల అకృత్యాలపై స్పందించకుండా ఎమ్మెల్యే మౌనంగా ఉండడం దుర్మార్గమని విమర్శించారు. నాగాలమ్మ ఆలయ పునర్నిర్మాణమే లక్ష్యంగా ఉద్యమిస్తామని తెలిపారు. దామినేడు వాసులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



నాగాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తురాలు (ఫైల్)



టీడీపీ నేతల నిర్వాకానికి ఆనవాలు లేని ఆలయం

ఆర్‌డీఓ కార్యాలయంలో చర్చలు

నాగాలమ్మ ఆలయం కూల్చివేతపై దామినేడు వాసులు శనివారం తిరుచానూరు పోలీసులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేత కృష్ణమూర్తి నాయుడు నేతృత్వంలోనే ఆలయం కూల్చివేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదివారం ఈ మేరకు తిరుపతి ఆర్‌డీఓ కార్యాలయంలో దామినేడు గ్రామస్తులు, టీడీపీ నేత కృష్ణమూర్తి నాయుడుతో సుమారు 4 గంటలపాటు ఆర్‌డీఓ రామ్మోహన్ చర్చించారు. ఆలయ కూల్చివేతపై స్థానికులు మండిపడినట్లు తెలిసింది. పొంతన లేకుండా సమాధానాలిస్తున్న కృష్ణమూర్తినాయుడిని నిలదీసినట్లు సమాచారం. ఈ క్రమంలో జూలై 31వ తేదీలోపు నాగాలమ్మ ఆలయాన్ని పునర్నించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనికి కృష్ణమూర్తి నాయుడు సైతం అంగీకరించినట్లు సమాచారం. ఈ సందర్భంగా దామినేడులోని సర్వే నంబర్ 191 నుంచి 194లో ఉన్న నాలుగు ఎకరాల ఆక్రమణపై ఆర్‌డీఓకు స్థానికులు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. అయితే ముందుగా ఆలయ విషయం మాత్రమే విచారణ చేస్తామని, ఆక్రమణపై మరోసారి మాట్లాడుదామని ఆర్‌డీఓ చెప్పినట్లు తెలిసింది.

అబద్ధాలతో అరాచక పాలన

- ఏడాదిగా ప్రజలను వంచిస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్
- తల్లికి వందనం అంటూ 30లక్షల మందికి మోసం
- ఆలయాలు కూల్చేసి మనోభావాలను దెబ్బతీస్తున్న కూటమి నేతలు
- భూమన కరుణాకరరెడ్డి, ఆర్‌కే రోజా



కూటమి మోసాలపై పుస్తకం ఆవిష్కరిస్తున్న భూమన, రోజా, సిపాయి సుబ్రమణ్యం, భరత్, శిరీష, విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, వెంకటేగౌడ్, సునీల్‌కుమార్

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో కూటమి ఏడాది పాలనలో మోసాలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ మంత్రి ఆర్‌కే రోజా, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు చావా రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, భరత్, తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, చిత్తూరు, సత్యవేడు, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్తలు విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, వెంకటేగౌడ్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భూమన కరుణాకరరెడ్డి మాట్లాడారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని నోటికొచ్చిన అబద్ధపు హామీల చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గుప్పించారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఒక్క హామీని కూడా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాల కంటే రెండింతలు ఇస్తానని చెప్పి, అందరినీ వంచించిన ప్రజాద్రోహి చంద్రబాబు అని స్పష్టం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2.80లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అమ్మ ఒడి పథకం కింద రాష్ట్రంలో ఎంతమంది లబ్ధిదారులు ఉంటే అంతమంది తల్లుల ఖాతాల్లోకి రూ. 15వేలు చొప్పున జమచేసిన మొనగాడు జగనన్న అని కొనియాడారు. అయితే తల్లికి వందనం అంటూ చంద్రబాబు 30లక్షల మంది తల్లుల ఖాతాల్లో డబ్బులు వేయకుండా ఎగనామం పెట్టారన్నారు. అలాగే ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా మహిళలకు రూ. 1,500 చొప్పున అందిస్తామని మోసం చేశారని చెప్పారు. యాభై ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ. 4వేలు, నిరుద్యోగులకు రూ. 3వేలు భృతి, అన్నదాతా సుఖీభవ కింద రైతులకు రూ. 20వేల చొప్పు ఇస్తానంటూ చెప్పిన హామీలన్నీ ఏమైయ్యాయి చంద్రబాబు అని ప్రశ్నించారు. ఏడాది కాలంలో మోసాలు, అభూతకల్పనలతోనే పాలన సాగించారే కానీ, రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నోరు పారేసుకోవడం, వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు నమోదు చేయడం, ఎల్లో మీడియా ద్వారా విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తిరగబడే రోజులు వచ్చాయి

మాజీ మంత్రి ఆర్‌కే రోజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి అరాచకాలు, అక్రమాలతో లోకేష్ రెడ్‌బుక్ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలను అందించకుండా వైఎస్సార్‌సీపీ నేతలు, జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు చెంపదెబ్బ కొడుతున్నా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవడం లేదన్నారు. అలాగే గిట్టుబాటు ధర కల్పించని చంద్రబాబుపై మామిడి రైతులు భగ్గుమంటున్నారని తెలిపారు. రైతు బాంధవుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లోనే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మామిడి రైతులకు రూ. 40 గిట్టుబాటు ధరను కల్పించారని గుర్తుచేశారు.అదే కూటమి ప్రభుత్వంలో రూ.4లు కూడా గిట్టుబాటు ధర పలకకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలు, సంక్షేమాన్ని పవన్‌కల్యాణ్ గాలికి వదిలేశారన్నారు. సనాతనధర్మాన్ని పరిరక్షిస్తానంటూ ఊదరగొట్టి, రాష్ట్రంలోని పలు ఆలయాలను కూటమి నేతలు కూల్చివేస్తుంటే ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండతో కూటమి నేతలు ఇష్టారాజ్యంగా ఆలయాలను కూలుస్తూ హిందువులు మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. అరాచక పాలనపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని హెచ్చరించారు. ప్రభుత్వ అకృత్యాలను ఎండగట్టేలా వైఎస్సార్‌సీపీ పోరాటం ఉంటాయని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

మోటారుసైకిల్ దగ్ధం



కాలిపోతున్న బైక్

కలువాయి(సైదాపురం) : కలువాయి బస్టాండ్ సెంటర్‌లో సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుడు కరీముల్లా అనే వ్యక్తికి చెందిన మోటారుసైకిల్ ఆదివారం అగ్నికి ఆహుతైంది. బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగంతో స్థానికులు గమనించి ఆర్పేందుకు యత్నించారు. అయితే అప్పటికే బైక్ పూర్తిగా దగ్ధమైంది.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కోట : మండలంలోని కొండుగుంట గ్రామానికి చెందిన నాగరాజు(48) ఆటోడ్రైవర్ ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.కుటుంబ కలహాల నేపథ్యంలోలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరేసుకున్నట్లు వెల్లడించారు. మృతుడికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్ : అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవకోన వద్ద శుక్రవారం జరిగిన దాడిలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాల మేరకు.. జీవకోన క్రాంతి నగర్‌కు చెందిన మణి(30) మద్యం తాగి సమీపంలోని ఆలయం వద్ద పడుకున్నాడు. ఇ శివ ప్రసాద్ రెడ్డి, దిలీప్ కుమార్, విజయ్ కుమార్ అనే వ్యక్తులు మణిపై దాడి చేశారు. స్థానికులు గమనించి బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో మణి మరణించడంతో నిందితులపై హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్లు తెలిపారు.

ముక్కంటి ఆలయంలో గందరగోళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. భక్తుల రద్దీ పెరుగుతున్న క్రమంలో వారి సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. ఇలాంటిదే ఆదివారం చోటు చేసుకుంది. ఓ మహిళా భక్తురాలు మొబైల్ లగేజ్ కౌంటర్‌లో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆలయ అధికారులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించారు. అయితే ఏఈఓ, డెప్యూటీ ఈవో అందుబాటులో లేకపోవడంతో ఆమె ఆ ఫిర్యాదును ఎవరికి ఇవ్వాలో తెలియక ఆలయ పరిపాలనా భవనం వద్ద సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి అక్కడికి రావడం ఆయనతో మాట్లాడి ఫిర్యాదు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే దానిపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారో తెలియడం లేదు. అదేవిధంగా మరో భక్తురాలు తన డబ్బులు కొట్టేశారని పోలీస్ అవుట్ పోస్ట్ వద్ద ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి ఆ ఆనవాళ్లు కనిపించకపోవడంతో ఆమెకు నచ్చజెప్పి పంపించేశారు. దీనిపై డెప్యూటీ ఈఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.



ఆన్‌లైన్ బదిలీల్లో జరిగిన తప్పిదాలను పరిష్కరించాలని డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డీఈవో పూల్ భాషా పండితులు

ముగిసిన బాధల బదిలీలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెల రోజులుగా సాగిన టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. కౌన్సెలింగ్ మొదలైన నాటి నుంచి ముగిసే వరకు ఏదో ఒక సమస్య వెంటాడుతూ వచ్చింది. ఎస్‌ఏలు, హెచ్ఎంలు, పండిట్‌లకు ఆన్‌లైన్ విధానం, ఎస్జీటీలకు మాన్యువల్‌లో బదిలీలు చేపట్టారు. రెండు విధానాల్లోనూ బదిలీలను పకడ్బందీగా నిర్వహించడంలో కూటమి సర్కారు విఫలమైంది. బదిలీల్లో ఉపాధ్యాయులకు ఆనందం కంటే ఆందోళనే ఎక్కువ కనిపించింది. గతంలో ఎప్పుడూ ఇలాంటి అడ్డదిడ్డ బదిలీలు చూడలేదని గురువులు గుర్రు మంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బదిలీల ప్రక్రియ పై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ కథనం.

- వారం రోజులుగా సాగిన టీచర్ల కౌన్సెలింగ్
- ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉపాధ్యాయుల బదిలీలు
- వింత నిబంధనలతో నష్టపోయిన ఎస్జీటీ, భాషా పండితులు
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో సాఫీగా సాగిన కౌన్సెలింగ్
- కోర్టు తలుపు తట్టేందుకు సిద్ధమవుతున్న బాధిత ఉపాధ్యాయులు



• ఈ చిత్రంలో కనిపిస్తున్న ఉపాధ్యాయురాలు పేరు సుధారాణి. ఆమె 9 నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. అయితే డీఈవో పూల్ లో ఉండే భాషా పండితుల బదిలీల్లో ఆమెకు అన్యాయం జరిగింది. కూటమి పాలనలో వెబ్ విచిత్ర బదిలీలతో ఉద్యోగ విరమణ పొందే సమయంలో ఆమె సీనియర్ అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా 120 కి.మీ దూరంలో బదిలీ చేశారు. తిరుపతి సమీపంలో ఆప్షన్ నమోదు చేసినప్పటికీ దూరప్రాంతంలో బదిలీ చేయడంతో ఆమె నష్టపోయింది.



• ఈ టీచర్ పేరు కస్తూరి. ఈమెకు స్పౌజ్ నిబంధనను నమోదు చేసుకున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా 90 కి.మీ దూరంలో బదిలీ చేశారు. దీంతో ఈమె ప్రస్తుత బదిలీల్లో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



• ఈ టీచర్ పేరు కనకదుర్గ. ఈమె న్యాయపరంగా భర్తతో విడాకులు తీసుకున్నారు. దీంతో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో పాయింట్స్ పొంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అన్ని అర్హతలున్నా నిబంధనలకు వ్యతిరేకంగా అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలానికి బదిలీ చేశారు.

చిత్తూరు కలెక్టరేట్:ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పారదర్శకంగా, పకడ్బందీగా సాగాల్సిన బదిలీల ప్రక్రియపై టీచర్లు సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు గందరగోళం నెలకొంది. కేడర్ల వారీగా పారదర్శకమైన సీనియారిటీ జాబితా రూపొందించడంలో జిల్లా విద్యాశాఖ విఫలమైంది. మెరిట్ రోస్టర్ ప్రకారం కాకుండా రోస్టర్ మెరిట్ ప్రకారం జాబితా సిద్ధం చేశారు. ఈ విషయంపై రాష్ట విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ఆ తర్వాత సరిదిద్దారు. ఆ జాబితాల్లో తప్పులుండటంతో విద్యాశాఖ అధికారులను ఏమి అడిగినా తమకు సంబంధం లేదని నిర్లక్ష్య సమాధా నం చెప్పడంతో చాలా మంది టీచర్లు నష్టపోయారు.

జీఓ 22కు తిలోదకాలు

కౌన్సెలింగ్ ప్రక్రియలో జీఓ 22కు వ్యతిరేకంగా ఇష్టానుసారంగా వ్యవహరించారు. మొదట్లో 2008 హామీ పత్రాలకు సంబంధించి నోషనల్ సీనియారిటీని..సీనియారిటీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ఈ విషయంపై నోషనల్ సీనియారిటీ కేవలం ఆర్థిక, ఉద్యోగోన్నతులకు మాత్రమే వర్తిస్తుందని పలువురు టీచర్లు అప్పీల్ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత లీప్ యాప్‌లో డేటా సరిదిద్దారు. ఈ నిర్ణయం వల్ల 133 మంది టీచర్లు నోషనల్ సీనియారిటీని సరిదిద్దుకోకుండా అదే స్థానాల్లో బదిలీలు పొందారు. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారుల మాట విన్నందుకు చాలా మంది టీచర్లు బదిలీల్లో నష్టపోయారు. నోషనల్ సీనియారిటీ సరిదిద్దుకోని టీచర్లు లాభం పొందారు.



సమస్యలు పరిష్కరించాలని చిత్తూరు డీఆర్‌ఓను చుట్టుముట్టిన టీచర్లు (ఫైల్)

వైఎస్సార్‌సీపీ సర్కారులో పారదర్శకంగా బదిలీలు

గత వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో టీచర్ల బదిలీలు సాఫీగా సాగాయి. టీచర్లకు అప్పట్లో నిర్వహించిన ఆన్‌లైన్ బదిలీల్లో ఎలాంటి సమస్యలు తలెత్తని పరిస్థితి. నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించడంతో గతంలో అన్ని కేడర్ల టీచర్లకు న్యాయం జరిగింది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు టీచర్ల బదిలీల బాధలను మిగిల్చారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం పాఠశాలలు 4,737

ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయుల వివరాలు

ప్రాథమిక పాఠశాలలో టీచర్లు :	3,236
ప్రాథమికోన్నతలో :	656
ఉన్నత పాఠశాలలో :	1,766
హైస్కూల్ ప్లస్ :	485
జూనియర్ కళాశాలలో :	466

బదిలీల ప్రక్రియలో సాఫ్ట్‌వేర్ తప్పిదం, విద్యాశాఖ అధికారుల నియతృత్వ పోకడలతో చాలా మంది టీచర్లు నష్టపోయారు. ఈ బదిలీల ప్రక్రియలో నష్టపోయిన పలు కేడర్ల టీచర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. కూటమి పాలనలో నిర్వహించిన బదిలీల్లో తీవ్రంగా నష్టపోయామని కొంత మంది టీచర్లు మదనపడుతున్నారు.

టీచర్లకు బదిలీల్లో అన్యాయం ఇలా..

- గతంలో టీటీడీ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు స్పౌజ్ పాయింట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం వారికి పాయింట్లు ఇవ్వడం కుదరదని మొండికేశారు. కమిషనర్ కార్యాలయం నుంచి వివరణ వచ్చినప్పటికీ పరిగణలోకి తీసుకోని పరిస్థితి. దీంతో చాలా మంది పీఎస్ హెచ్ఎంలు దూర ప్రాంతాలకు బదిలీ అయ్యారు.
- 2021లో బదిలీలు పొంది 2025లో రేషనలైజేషన్‌కు గురైన వారికి పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టించారు.
- ప్రిఫరెన్షియల్ కేటగిరీకి సంబంధించి తిరుపతి రుయాలో ప్రత్యేకంగా చికిత్సలు చేయించి మైల్డ్, మోడరేట్, సివియర్ అని ఫలితాలు ఇచ్చారు. సంబంధిత టీచర్లకు పర్సంటేజీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. అయితే చివరి వరకు ఆ సమస్య పరిష్కరించకపోవడంతో ఫిపరెన్షియల్ పాయింట్లు పొందలేక నష్టపోయారు.
- అలవెన్స్‌లు పొందుతున్న టీచర్లకు బదిలీల్లో మినహాయింపులు ఇచ్చారు. అయితే సంబంధిత టీచర్లకు బదిలీల్లో ప్రాధాన్యం కల్పించలేదు.
- సీనియారిటీ జాబితాల్లో తప్పుల సవరణకు సంబంధించి అభ్యంతరాలు ఇచ్చిన టీచర్ల పై దురుసుగా ప్రవర్తించి మొండిగా వ్యవహరించారు. సంఘాల నాయకులను కౌన్సెలింగ్ కేంద్రంలోకి రానివ్వకుండా బెదిరింపులకు గురిచేశారు.



ఎస్జీటీలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ (ఫైల్)

- జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఎటువంటి పోస్టును బ్లాక్ చేయకుండా బదిలీలు నిర్వహిస్తామని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు గొప్పలు చెప్పారు. అయితే ఈ బదిలీల్లో పలు పోస్టులు బ్లాక్ చేసి టీచర్లు నష్టపోయేలా వ్యవహరించారు. దీంతో సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో చాలా మంది టీచర్లు బదిలీ అయినా రిలీవర్ లేక అలాగే కొనసాగాల్సిన దుస్థితి. బదిలీ అయినా కుప్పం నుంచి విముక్తి కలగలేదని చాలా మంది టీచర్లు ఆవేదన చెందుతున్నారు.
- స్పౌజ్ విషయంలో స్పౌజ్ ఎక్కడ ఉంటే చుట్టు పక్కల ఉండే మండలాలకు వెళ్లాలి. అయితే ఈ నిబంధన ఎస్జీటీ బదిలీల్లో సీరియల్ నంబర్ 204 వరకు అమలు చేయకపోవడంతో నష్టపోయారు. ఇద్దరు టీచర్లు కంపల్‌సరీ బదిలీ అయితే వారు ఎక్కడైనా కోరుకునే అవకాశం ఉంటుంది. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ నిబంధనను అమలు చేయకుండా నిర్బంధం పెట్టి సర్టిఫికెట్ ఎక్కడ పెట్టి ఉంటే అక్కడే కోరుకోవాలనే వింత పోకడ అమలు చేశారు. దీంతో వందల సంఖ్యలో టీచర్లు బదిలీల్లో నష్టపోయారు. ఆ తర్వాత ఆందోళనలు చేశాక అమలు చేశారు.
- స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ఉద్యోగోన్నతి ఇస్తున్నామని చెప్పి చివరికి వారికి ఉద్యోగోన్నతులు ఇవ్వకుండా తిరిగి పంపేశారు.
- డీఈవో పూల్ లో ఉన్న వందల మంది భాషా పండితులకు నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీలు చేశారు. సీనియారిటీ ఉన్న వారికి దూరంగా, జూనియర్‌లకు దగ్గరగా పోస్టింగ్‌లు ఇచ్చారు. దీంతో ఆ టీచర్లు బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ చివరి రోజు డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది.

వ్యభిచార గృహంపై దాడి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని అవాని అపార్టుమెంట్ వెనుక వీధిలోని ఓ ఇంటిలో వ్యభిచారం జరుగుతున్న సమాచారంతో ఆదివారం సాయంత్రం సీఐ బాబీ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఇద్దరు మహిళలు, ఒక విటుడు, నిర్వాహకుడు ఈదురు పవన్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. సీఐ మాట్లాడుతూ సురేష్, పవన్ కుమార్ ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకుడితో పాటు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. మరో వ్యక్తి సురేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

తీరంలో సందడి



కేరింతలు కొడుతున్న పర్యాటకులు

వాకాడు : సముద్రంలో వేట విరామం గడువు ముగిసిపోంది. రెండు నెలల తర్వాత ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం తీరంలో సందడి మొదలైంది. వేకువజామునే మత్స్యకారులు తమ ఇష్టదైవానికి పూజలు నిర్వహించారు. వేట సామగ్రితో సముద్రంలోకి బయలుదేరారు. తొలి రోజు వాతావరణంలో మార్పుల కారణంగా అరకొర మత్స్యసంపదతో ఒడ్డుకు చేరారు. ఈ క్రమంలోనే జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో తూపిలిపాళెం బీచ్‌కు చేరుకున్నారు. సముద్రంలో స్నానం చేసి, వన భోజనాలతో సందడి చేశారు.

రెండు ఇళ్లలో చోరీ



వేణు ఇంట్లో తెరిచిన బీరువా



శ్రీనివాసులు నివాసంలో..

పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లె దళితవాడలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఈ మేరకు పోలీసులు వివరాలు వెల్లడించారు. వేణు, అతడి కుమారుడు శ్రీనివాసులు పక్కపక్కనే వేర్వేరుగా నివసిస్తున్నారు. శనివారం వారు ఎస్‌ఆర్‌పురం వెళుతూ రెండిళ్ల తాళాలను బాత్‌రూమ్‌లలో ఉంచారు. ఈ విష యం పసిగట్టిన దుండగులు ముందుగా బాత్‌రూమ్‌లలోని రెండిళ్ల తాళాలలను తీసుకుని లోపలికి చొరబడ్డారు. వేణు ఇంట్లో 150 గ్రాము ల వెండి, 16 గ్రాముల బంగారం, శ్రీనివాసులు నివాసంలో 250 గ్రాముల వెండి, 30 గ్రాముల బంగారం అపహరించారు. ఆదివారం తిరిగి వచ్చిన వేణు, శ్రీనివాసులు తమ ఇళ్లలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలను సేకరించారు. చోరీ తీరును పరిశీలిస్తే ఈ పని తెలిసిన వారు చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. సీఐ సుదర్శన్‌ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరణంలోనూ వీడని స్నేహం

– చుక్కలనిడిగల్లులో విషాదం



ప్రశాంత్ (ఫైల్)



మురళీకృష్ణ(ఫైల్)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు గత నాలుగు రోజులుగా శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన స్నేహితులు మురళీకృష్ణ(20), ప్రశాంత్(20) మృతి చెందడం తీవ్ర విషాదం మిగిల్చింది. సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి పెరిమిడి మురళీకృష్ణ మృతి చెందాడు. మిత్రుడు గల్లంతవడం చూసిన ప్రశాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరో స్నేహితుడు బలవన్మరణానికి యత్నించాడు. వివరాలు.. కాకినాడ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి కళాశాలలోనే నంబర్‌వన్‌గా రాణిస్తున్న పెరిమిడి మురళీకృష్ణ వేసవి సెలవుల నేపథ్యంలో గ్రామానికి వచ్చాడు. చిన్నప్పటి నుంచి ఒక జట్టుగా ఉండే ధనుష్, మురళీకృష్ణను కలుసుకున్నాడు. వారి స్నేహం అపురూపంగా ఉండేది. మురళీకృష్ణ చదువులో మంచి ప్రతిభను కనబరిస్తే, మిగిలిన ఇద్దరూ చిన్నచిన్న పనులు చేసుకునేవారు. ఈ క్రమంలో గురువారం తొట్టంబేడు మండలంలోని ఓ స్నేహితుని కలిసేందుకు వీరు ముగ్గురూ వెళుతూ మార్గం మధ్యలో తెలుగుగంగ కాలువలో ఈత కొట్టేందుకు దిగారు. ప్రవాహ ఉధృతికి మురళీకృష్ణ కొట్టుకుపోయాడు. దీనిపై మురళీకృష్ణ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపట్టి 13వ తేదీ సాయంత్రం మురళీకృష్ణ మృతదేహాన్ని వెలికితీశారు. స్నేహితుడి మరణాన్ని జీర్ణించుకోలేని ప్రశాంత్ పురుగుల మందు తాగేశాడు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మరణించాడు. ఇద్దరు మిత్రులు కన్నుమూయడంతో ఆవేదన తట్టుకోలేక ధనుష్ సైతం శానిటైజర్ తాగేశాడు. అయితే వెంటనే వైద్యసేవలందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

స్నేహితుడి పాడె మోసి వీడ్కోలు



మిత్రుడికి కన్నీటి వీడ్కోలు పలుకుతున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం:వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డికి సన్నిహితుడిగా పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించిన సోడిశెట్టి నరేష్ రాయల్ శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో నరేష్ భౌతికకాయానికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి నివాళులర్పించారు.మిత్రుడి నరేష్ మరణాన్ని జీర్ణించుకోలేని అభినయ్ భావోద్వేగానికి గురయ్యారు. స్వయంగా స్నేహితుడి పాడె మోశారు. దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని గాంధీపార్కు సమీపంలో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బాబి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు గాంధీ పార్కు సమీపంలో దాడి చేసినట్టు తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్టు పేర్కొన్నారు. 50 బస్తాల బియ్యం(1950 కేజీలు), దోస్తు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వాహన డ్రైవర్ గొడమాల విజయ్‌కుమార్, యాజమాని కాసి నాగరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆనాటి.. ఆ స్నేహమానందగీతం!



కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు

- 31 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- భావోద్వేగానికి గురైన మిత్ర బృందం

శ్రీకాళహస్తి : స్నేహమాధుర్యం మళ్లీ వారిని బడిఈడు పిల్లలుగా మార్చేసింది. ఎవరు ఎంత ఎత్తుకు ఎదిగినా ఆనాటి స్నేహం ఆనంద గీతమై ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ మధుర స్మృతులను గుర్తుచేసింది. దాదాపు 31 ఏళ్ల తర్వాత శ్రీకాళహస్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1994 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక కై కాల సత్రంలో కలుసుకున్నారు. బాధలు తెలియని నవ్వులు, మౌనం తెలియని మాటలు, కల్మషమెరుగని ప్రేమలు, కష్టం ఎరుగని క్షణాలతో గడిపిన రోజులను జ్ఞప్తికి తెచ్చుకుని మురిసిపోయారు. చదువులమ్మ ఒడిలో చేసిన అల్లరిని నెమరువేసుకున్నారు. మనసులో మరపురాని బాల్యపు పుటలను తిరగవేసి ఆనంద క్షణాలను ఆస్వాదించారు. ఇకపై అందరూ టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు ఇచ్చిపుచ్చుకున్నారు. స్నేహితులకు తమ కుటుంబసభ్యులను పరిచయం చేసుకున్నారు. అపూర్వ సమ్మేళానికి గుర్తుగా ఫొటోలు తీసుకుని భద్రపరుచుకున్నారు. అనంతరం తాము విద్యను అభ్యసించిన పాఠశాలకు వెళ్లి ఆయా సెక్షన్లలో కూర్చొని పరవశించారు. కార్యక్రమ నిర్వహణకు పూర్వ విద్యార్థులు హరి, మునస్వామి, నాదముని, త్రిమూర్తి, జ్ఞానశేఖర్, హేమకుమార్, కేశవన్, నాగేంద్ర కుమార్ మహేష్, ఫాజిల్ తదితరులు పర్యవేక్షించారు. మొత్తం 150 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలతో తరలివచ్చి విజయవంతం చేశారు.

ఫుట్‌బాల్ విజేతలకు ట్రోఫీలు



తిరుపతి జట్టుకు ట్రోఫీ అందిస్తున్న సీఐ బాబీ



నాయుడుపేట జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఏఎల్‌సీఎం గ్రౌండ్‌లో అండర్ 17, 14 విభాగాలలో ఆదివారం నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్స్‌లో తిరుపతి, నాయుడుపేట జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్–17 విభాగంలో విన్నర్‌గా తిరుపతి జట్టు, రన్నర్స్‌గా రేణిగుంట, అండర్–14 విభాగంలో విన్నర్‌గా నాయుడుపేట, రన్నర్స్‌గా తిరుపతి జట్లు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. అర్బన్ సీఐ బాబీ చేతులమీదుగా ట్రోఫీలు బహూకరించారు. సీఐ మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న గౌస్‌బాషా నాని, వినోద్ కుమార్, రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, మైనుద్దీన్, బీజే ప్రసాద్, కళాచంద్, ఆనంద్, భావిన్ అనుదీప్, టైసన్, రాఖీ, ఏలిష, సిరాజ్, భాను విజయ్ పాల్గొన్నారు.